## క్లుప్తంగా

### 5న జాబ్ మేళా

**డిండి :** ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లా కేంద్రంలో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన యువకులందరికీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ పేరును నమోదు చేయించుకోవాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. దరఖాస్తుదారులను 5న ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా కేంద్రానికి తీసుకెళ్లనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మిగతా వివరాలకు 87126 70223 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### 6న రాములోరి కల్యాణం

**కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 6న శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు నాయిని మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా విచ్చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాములోరి కల్యాణోత్సవం సందర్భంగా రథోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బుచ్చిరెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, దాచేపల్లి నరేందర్, బూడిద వెంకటేష్‌యాదవ్, కుంభం యాదగిరిగౌడ్, రావుల సత్యనారాయణ, నీల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### పట్టుదలతో పనిచేస్తేనే గుర్తింపు



బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐని సన్మానిస్తున్న సీఐ పీఎన్‌డీ ప్రసాద్

**మిర్యాలగూడ టౌన్ :** పట్టుదలతో పనిచేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు అనేది ఉంటుందని మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. మంగళవారం బదిలీపై సూర్యాపేట జిల్లాకు వెళ్తున్న మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ గౌరీ శంకర్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజమని, ఉద్యోగులు ఎక్కడ పని చేసినా నీతి, నిజాయితీగా పని చేయాలన్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌కు గౌరీ శంకర్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్- 2 ఎస్‌ఐ సైదులు, హెడ్ కానిస్టేబుల్ జానకి రాములుతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సేవతో సమగ్ర వ్యక్తిత్వ వికాసం

**నకిరేకల్ :** జాతీయ సేవా పథకంలో పనిచేసి సేవలందించిన వలంటీర్లకు సమగ్ర వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని నల్లగొండ ఎంజీ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలంలోని ఓగోడు గ్రామంలో నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండో రోజు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో పలు చోట్ల శ్రమదాన కార్యక్రమాలను నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం అధికారి నర్సింహ, కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, అధ్యాపకులు ప్రవీణరెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శంకర్, శ్రీను, సతీష్, శివశంకర్, నర్సింహచారి, ఎన్‌ఎస్‌ఎస్‌విద్యార్థులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా మొక్కల పెంపకం

- గ్రామాల్లో 38 నర్సరీల ఏర్పాటు
- వానాకాలం నాటికి 2.88లక్షల మొక్కలు సిద్ధం
- నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**డిండి :** మండలంలో హరితహారం కార్యక్రమాన్ని గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది ఎలాగైనా విజయవంతంగా చేపట్టి ప్రతి గ్రామంలో పచ్చదనం పరుచుకునేలా చేయాలని సంబంధిత అధికారులు ప్రతి గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలానికిచ్చిన 2,88,405 మొక్కల పెంపకం లక్ష్యాన్ని చేరడానికి అధికారులు ఆయా నర్సరీల్లో మొక్కలను పెంచే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ సందర్భంగా ఎవెన్యూ ప్లాంటేషన్ కింద 20శాతం, కమ్యూనిటీ, ఇనిస్ట్యూషన్ 20శాతం, ఈత ప్లాంటేషన్ 10శాతం, హోమ్‌స్టైడ్ 15శాతం, ట్యాంక్‌బండ్ ప్లాంటేషన్ 5శాతం, బండ్ ప్లాంటేషన్(రైతు పొలాల గట్టు) 20శాతం, బయో పెన్సింగ్ ప్లాంటేసన్ 10 శాతం మొత్తం 7 కేటగిరిల్లో కానుగ, ఈత, వేప, వెదురు, గుల్‌మోహర్, గోరింటాకు, మందారం, జామ, బొప్పాయి, మునగత వంటి మొక్కలను పెంచుతున్నారు. నర్సరీలకు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి ఒకవేళ సమస్య వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత ఈజీఎస్ అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటి వరకే ఆదేశాలు జారీ చేశారు.



డిండి నర్సరీలో పెంచుతున్న హరితహారం మొక్కలు

**పెంచిన ప్రతి మొక్కనూ నాటేందుకు..**

హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో జనాభా సంఖ్యకనుగునంగా మొక్కలను నాటాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయి. ఈ సందర్భంగా నర్సరీలో పెంచిన ప్రతి మొక్కనూ నాటడానికి ఇప్పటి వరకే మండలంలోని ప్రదేశాలను గుర్తించామని , మొక్కలు నాటినంతరం వాటి సంరక్షణకు పక్కా ప్రణాళికలు తయారు చేస్తున్నామని సంబందికారులు పేర్కొంటున్నారు. ఇందుకుగాను మొక్కలు నాటక ముందే ప్రతి గ్రామంలో హరితహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈజీఎస్ సిబ్బంది సిద్ధమయ్యారు.

**అవగాహన కల్పించాలి**



రాష్ట్రాన్ని హరితవనంగా మార్చాలని గత ప్రభుత్వం చేపట్టిన హరితహార కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలి. నాటిన మొక్కనే బతికించేలా చర్యలు చేపట్టి ప్రజాధనం వృథాకాకుండా చర్యలు చేపట్టాలి.

– జవహర్, జేత్యతండా

**ప్రజలు సహకరించాలి**



హరితహార కార్యక్రమానికి అధికారులతోపాటు ప్రజలు కూడా సహకరించాలి. ఈ ఏడాది నాటిన ప్రతిమొక్క ఎదిగేంత వరకు సంరక్షించాలని ముందస్తుగానే ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

వెంకన్న, ఎంపీడీఓ, డిండి

## పన్ను వసూళ్లలో మిర్యాలగూడది అగ్రస్థానం

**మిర్యాలగూడ టౌన్ :** ఆస్తి పన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లాలో మిర్యాలగూడ మున్సిపాలిటీది అగ్రస్థానంలో నిలిచిందని మున్సిపల్ రెవెన్యూ అధికారిని (ఆర్ఓ) జి. జ్ఞానేశ్వరీ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత నెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌ల మార్గదర్శకంతో పాటు స్పెషల్ డ్రైవ్‌లో భాగస్వాములు కావడంతో రూ.3.51కోట్ల వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం రూ.11.32 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. 90శాతం రాయితీ ద్వారా రూ.1.07కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిపారు. మార్చి 30, 31 తేదీల్లో ప్రత్యేక కౌంటర్ ద్వారా ఆదివారం రూ.42 లక్షలు వసూలు కాగా సోమవారం రూ.11.49 లక్షల వరకు వసూలైనట్లు తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని అధిగమించడంతో 15వ ఆర్థిక సంగం నిధులు అధికంగా పొందే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తీ పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాని కోరారు.ఈ సమావేశంలో ఆర్‌ఐలు సాంబయ్య, సాజి తదితరులు ఉన్నారు.

## చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మిర్యాలగూడ టౌన్ :** ఎండ తీవ్రత మరింత పెరుగుతున్నందున ప్రయాణీకులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం గంగుల రాంమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అవరణలో శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 40 నుంచి 50వేల మంది వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వెళ్తుంటారన్నారు. సత్యసాయి సేవా సమితి వారు ముందుకు వచ్చి ప్రయాణికుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సత్యసాయిసేవా సమితి కన్వీనర్ చిల్లంచర్ల ఆదినారాయణ, సభ్యులు శివరాం, గుప్తా తదితరులు ఉన్నారు.



బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం

## వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

**గుర్రంపోడు :** మండలకేంద్రంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు ఎమ్మెల్యేకు దేవస్థాన కమిటీ, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ పండితులు అల్లవరపు సుబ్రమణ్య దీక్షితావధానులు , వట్టికోట శ్రీనివాస శర్మ, మోపోజు కిరణ్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో మేళతాళాలు, భాజా భజంత్రీల మధ్య శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవానికి మండలకేంద్రంతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

**మిర్యాలగూడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ తెలిపారు. ఏడాదికి రూ.1.50లక్షల ఆదాయం లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలకు చెందిన వారు ఈనెల 14లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. రేషన్ కార్డు ఉన్న వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదని, రేషన్‌కార్డు లేని వారు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు వ్యవసాయేతర పథకాలకు 21ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, వ్యవసాయానికి సంబంధించిన పథకానికి 21ఏళ్ల నుంచి 60ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. రూ.50వేల లోపు రుణానికి వందశాతం రాయితీ, రూ.1లక్షలోపు రుణానికి 90శాతం రాయితీ, పదిశాతం బ్యాంకు రుణం, రూ.1లక్ష నుంచి రూ.2లక్షలలోపు రుణానికి 80శాతం రాయితీ 20శాతం బ్యాంక్ రుణం, అదే విధంగా రూ.2లక్షలనుంచి రూ.4లక్షల రుణానికి 70శాతం రాయితీ 30శాతం రుణం బ్యాంక్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఎంబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితోపాపటు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్ దరఖాస్తును డాక్యుమెంట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

**అడవిదేవులపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తులు చేసుకోవాలని అడవిదేవులపల్లి ఎంపీడీఓ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డులు లేని లేని వారు మాత్రమే ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. జూలై 1వ తేదీ వరకు 21ఏళ్ల నుంచి 55ఏళ్ల లోపు వయస్స గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

**హాలియా :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం పంపిణీ కార్యక్రమం నిరుపేదలకు వరంలాంటిదని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హాలియా పట్టణంలోని అంగడి బజారు 39వ రేషన్ షాపు వద్ద లబ్దిదారులకు ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకం దేశ చరిత్రలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గతంలో రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసిన దొడ్డు బియ్యం పేదల కడుపు నింపడం లేదని ఆలోచించి పేదలంతా తినేలా సన్నబియ్యం పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సన్న బియ్యం పంపిణీ వల్ల రేషన్ బియ్యం అక్రమ రవాణ ఉండదన్నారు. లబ్దిదారులందరూ సన్న బియ్యం పథకాన్ని సక్రమంగా వినియోగించుకొని లబ్దిపొందాలన్నారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోని తద్వారా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, గౌనీ సుధారాణి, పిల్లి ఆంజనేయులు, కుందూరు రాజేందర్ రెడ్డి, మజహార్ మొహినొద్దీన్, ఇంచార్జ్ తహసీల్దార్ రఘు, ఆర్‌ఐ నవీన్‌కుమార్, నాయకులు గడ్డం రమణయ్య, నకిరేకంటి సైదులు తదితరులు ఉన్నారు.



హాలియా : రేషన్ షాపు వద్ద సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



పెద్దవూర : సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న లింగారెడ్డి

**సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం**

**పెద్దవూర :** దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రాత్మకమని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందనడానికి సన్నబియ్యం పంపిణే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ ఊరె వెంకన్న, నాయకులు నాగరాజు, ఐ.వెంకటయ్య, సతీష్, కాటేపల్లి వెంకటయ్య, అక్బర్, నాగయ్య, బొడ్డు వెంకన్న, రంజాన్, కోట లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ప్రతి కార్మికుడికి 25కిలోల సన్నబియ్యం ఇవ్వాలి

**నల్లగొండ టౌన్ :** ప్రతి వ్యవసాయ కార్మికుడికి 25కిలోల సన్నబియ్యం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కార్మికులకు రెండు నెలల పెండింగ్ బిల్లులు ఉన్నాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నవెంకులు, సరోజ, లింగస్వామి, రాములు, మారయ్య ఉన్నారు.

## ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌కు సన్మానం



త్రిపురారం : ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన నాయకులు

**త్రిపురారం :** ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను మంగళారం త్రిపురారం మండల గిరిజన సంఘం ఆధ్వర్యంలో మాటూరు గ్రామ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు పూల పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, త్రిపురారం మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వెంకట్రాం నాయక్, సీనియర్ నాయకులు రతన్ నాయక్, మంగ్తా నాయక్, సోమలింగా చారి, రాములు నాయక్, శంకర్ నాయక్, శివ శంకర్, వెంకటయ్య, కిషన్, భాస్కర్, హర్యా నాయక్, నగేష్, రవి, బాల, శ్రీరామ్, స్వామి,రంగా, కృష్ణ నాగు తదితరులు పాల్గొన్నారు.

**మిర్యాలగూడ టౌన్ :** ఎమ్మెల్సీ ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్‌ను మిర్యాలగూడ మండలంలోని జంకుతండాలో మంగళవారం గిరిజనులు సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కోటాల గిరిజనుడుకి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, ఉద్యోగుల సంఘం నాయకులు గోవర్ధన్, దేవోజీ, తిరుపతినాయక్, గణేష్‌నాయక్, మక్ల నాయక్, శంకర్‌నాయక్, మోతీలాల్, నేహ్రు నాయక్, పకీరా, నగేష్, అఖిల్, నరేందర్, తులసిరాం, లచ్చిరాం, నగేష్, దివాకర్, పవన్, చిన్న, మహేందర్, హుస్సెన్, పవన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : జంకుతండాలో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న గిరిజన మహిళలు

## బీసీలకు మంత్రి పదవి ఇవ్వాలి

**నల్లగొండ టౌన్ :** మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 42శాతం చోటు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఆరు మంత్రిపదవుల్లో నాలుగు బీసీలకు, 2 ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలన్నారు. అలాగే బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగం శ్రీకాంత్‌యాదవ్, మహ్మద్ నజీర్, చెన్నోజు రాజు, సంగం జగదీశ్వర్, దీకొండ నవీన్‌కుమార్, మార్గం సతీష్‌కుమార్, కర్నాటి జితేందర్, ఆవుల ప్రభాకర్, గంజి వెంకన్న పాల్గొన్నారు.

## భూములు విక్రయిస్తే ఉద్యమిస్తాం



దేవరకొండ : పోలీస్ స్టేషన్‌లో సీపీఎం నాయకులు



చింతపల్లి : అరెస్టయిన టీఆర్‌ఎస్‌వీ నాయకులు

**మిర్యాలగూడ అర్బన్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాన్ని ఆపేంత వరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందని స్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ అన్నారు. మంగళవారం తెల్లవారు జామున ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు, నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రఘు, బిస్మిల్లా ఉన్నారు.

**వేములపల్లి :** మంగళవారం హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు వెళ్తున్న సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి వేములపల్లి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి సంపత్, నాయకులు ప్రణీత్‌రెడ్డి, సైదులు ఉన్నారు.

**దేవరకొండ :** అక్రమ అరెస్టులు అప్రాజాస్వామికమని సీపీఎం నాయకులు నల్లా వెంకటయ్య అన్నారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి వారిని దేవరకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో యాదిగిరి, బిజిలి లింగయ్య, పర్వతరెడ్డి, బుడిగ వెంకటేష్, రహీం, జ్యోతి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : అరెస్టయిన నాయకులు

**సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్**

**హాలియా :** హెచ్‌సీయూ భూముల వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ ఎదుట ధర్నాకు వెళ్తున్న సీపీఎం నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, ఉన్నారు.

**టీఆర్‌ఎస్‌వీ నాయకుల అరెస్ట్**

**చింతపల్లి :** హెచ్‌సీయూ భూముల పరిరక్షణ ధర్నాకు వెళ్తున్న చింతపల్లి మండల బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆరెకంటి మురళి మాదిగ మాట్లాడారు. అరెస్టయిన వారిలో బీఆర్‌ఎస్‌వీ మిడిదొడ్డి నరసింహ, కానుగుల సురేశ్, పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డు పరిరక్షణే ధ్యేయం



దేవరకొండ : మహాసభలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

**దేవరకొండ :** సంక్షేమ బోర్డు పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆరవ మండల మహాసభను నిర్వహించారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర నాయకులు పల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. నిర్మాణ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రానున్న రోజుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై మరిన్ని పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరడానికి అనేక ఆంక్షలు విధిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం నూనె రామస్వామి, నూనె వెంకటేశ్వర్లు, సుదర్శన్ రెడ్డి, జూలూరి వెంకట్రాములు, మల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి**

**కొండమల్లేపల్లి :** నల్లగొండలోని మిర్యాలగూడలో రోడ్డులో ఉన్న ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నల్లగొండ జిల్లా ఏడో మహా సభను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం కొండమల్లేపల్లి ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఇంద్రయ్య, నగేష్, పాల్వాయి యాదగిరి, బొడ్డుపల్లి భిక్షం, భూతరాజు సైదులు, జావెద్, సైదులు, పొట్ట ప్రకాష్, చిలకరాజు శ్రీను, కొంగల వెంకటయ్య, బొడ్డుపల్లిను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

**నేరేడుచర్ల :** మండలంలోని మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం వేద పండితులు ఇరువంటి నరేంద్రశర్మ, రేవూరి శివకుమార్‌శర్మ, ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, జున్నాబట్ల కిశోర్ శర్మలు వేద మంత్రాలతో విఘ్నేశ్వర పూజ, హోమం నిర్వహించారు. ముందుగా మంగళవాయిద్యాలు, మేళతాళాలతో స్వామివార్ల విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పానుగోటి భుజంగరావు, కార్యదర్శి అరిబండి శ్రీరామయ్య, కోశాధికారి కట్ట శ్రీనివాస్‌రావు, కట్ట రామారావు, అరిబండి చిన సీతయ్య, అరిబండి భూషయ్య, పారెపల్లి సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కట్ట ప్రసాద్, పరమయ్య, మధు, రాకేష్, చినసీతయ్య, నర్సయ్య, సాంబయ్య, సాగర్, అరిబండి సురేష్, రాచకొండ శ్రీనివాస్‌రావు, అప్పారావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## ఆదమరిస్తే..ప్రమాదమే!



రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్న కాలువ

**పెద్దవూర :** మండలంలోని తుంగతుర్తి గ్రామ సమపంలో ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాలవ్వకు రక్షణ గోడ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ ప్రదేశంలో వాహనదారులు ఏకొద్దిపాటి అలసత్వం ప్రదర్శించినా, ఆదమరిచినా ఇక అంతే సంగతులు. నేరుగా వెళ్లి కాల్వలో పడాల్సిందే. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల తుంగతుర్తి స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రహదారిని రూ.లక్షల వెచ్చించి బీటీగా మార్చారు. ఇక్కడ ఎల్ ఆకారంలో మూలమలుపు ఉంది. దీనికి తోడు రహదారి బీటీ అంచుదాక కాల్వలైనింగ్ కోతకు గురై మట్టి తేలింది. వాహనదారులు ఇక్కడ ఏమాత్రం ఎమరుపాటు ప్రదర్శించినా వాహనం అతివేగంగా వచ్చి అదుపు తప్పినా నేరుగా కాల్వలో పడిపోవాల్సిందే. కనీసం ఇక్కడ ఎలాంటి రక్షణ గోడను గానీ, ప్రమాద హెచ్చరిక బోర్డులు గానీ ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై నిత్యం ఆటోలు, పాఠశాల బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుంటాయి. అధికారులు సత్వరమే స్పందించి మూలమలుపు వద్ద రక్షణ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.